క్లుప్తంగా

పాఠశాలల్లో ఎన్నో వసతులు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తుందని విద్యాశాఖ మానిటరింగ్ అధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలలో ప్రి ప్రైమరీ తరగతులు, క్రీడా పరికరాలను ఎంఈఓ మహతిలక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో పాఠశాలలకు కంప్యూటర్‌లను కూడా ఇవ్వనున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరాములు, హైస్కూల్ హెచ్‌ఎం నాగవేణి, రవీందర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవతోనే ప్రత్యేక గుర్తింపు



ఏఎస్‌ఐను సన్మానిస్తున్న ఏసీపీ సదానందం

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా, ఉత్తమ సేవలందిస్తే ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఏసీపీ సదానందం అన్నారు. మంగళవారం రాత్రి కోహెడ పీఎస్‌లో ఏఎస్‌ఐ ఎడ్ల పవన్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పవన్‌కుమార్ 42 యేళ్లుగా అంకిత భావంతో సేవలందించడం హర్షణీయమన్నారు. ఏఎస్‌ఐ దంపతులను ఘనంగా సత్కరించి బహుమతిని అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అభిలాష్, సీఐ శ్రీను, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట ఎస్‌ఐలు అభిలాష్, మహేశ్, విజయ్‌భాస్కర్, ఏఎస్‌ఐలు కనకయ్య, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన దిగుబడులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ ప్రవీణ్ కుమార్

దుబ్బాకటౌన్: రైతులు పంట సాగులో మెళకువలు పాటిస్తే మేలైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక రైతువేదికలో ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులకు ఎల్‌ఆర్‌జీ 52 కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాలు ఎండు తెగులును తట్టుకుంటాయని, అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. విత్తనాలను ఏక పంటగా లేదా పొలం గట్లపై వేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష్, హరీశ్, సురేందర్ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు



మాట్లాడుతున్న జయంత్ కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ తదితర గ్రామాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ నూనెగింజల కంటే 4 నుంచి 5 రెట్లు అధిక దిగుబడి ఉంటుందని, నాలుగు అంతర పంటలు సాగుచేసి మూడింతల ఆదాయం పొందవచ్చని సూచించారు. ఒక్కసారి సాగుచేస్తే 35 యేళ్ల వరకు దిగుబడి ఇస్తుందని, రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి గొప్పది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వైద్య వృత్తి చాలా గొప్పదని, వారిని ప్రజలు దేవుళ్లతో సమానంగా భావిస్తారని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని డాక్టర్‌లను, సిద్దిపేట కాంగ్రెస్ కౌన్సిలర్ రియాజొద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటం కేవలం డాక్టర్లకు మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గుండు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

కోహెడ(హుస్నాబాద్): ఉద్యమ కవి, గాయకుడు నేర్నాల కిశోర్‌ను రాష్ట్ర టూరిజం, భాషా సాంస్కృతికశాఖ సలహాదారుడిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటం హర్షణీయమని మండల కళాకారుల ప్రతినిధి పొన్నాల అశోక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సీఎం, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

భోజనశాలలు పూర్తి చేయరూ!

అసంపూర్తిగా నిర్మాణాలు

- ఏళ్లు గడుస్తున్నా సాగని పనులు
- పర్యవేక్షించని అధికారులు
- ఐదింటికి గాను పూర్తయింది ఒక్కటే
- కోతులతో విద్యార్థుల ఇక్కట్లు

ఆరుబయటే భోజనాలు తింటూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కోసం భోజనశాలల నిర్మాణాలు చేపట్టారు. కాని నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకుసాగడం లేదు. విద్యార్థులు ఆరుబయటే తింటూ ఇబ్బందులు పడుతున్నారు.



వరండాలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



గుడికందులలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన డైనింగ్‌హాల్ నిర్మాణం

తొగుట(దుబ్బాక): మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టింది. ఒక్కొక్క హాల్ నిర్మాణం కోసం రూ.14 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. తొగుట, కాన్గల్, వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట, ఘనపురం, గుడికందుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 658 మంది చదువుకుంటున్నారు.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఒక్కొక్కరికి మూడు, నాలుగు హాళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు పనులు సక్రమంగా పూర్తి చేయలేకపోయారన్న ఆరోపణలున్నాయి. వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట పాఠశాలల్లో గోడలు నిర్మించి పైకప్పు రేకులు వేశారు. గుడికందుల పాఠశాలలో పిల్లర్ల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. ఒక్క తొగుట పాఠశాలలో పనులు పూర్తిచేసి గత యేడాది జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల దాడులు

మండలంలోని అన్ని గ్రామాల్లో కోతుల బెడద పెరిగింది. ఆరుబయట భోజనాలు చేసే విద్యార్థులపై కోతులు దాడికి దిగుతున్నాయి. దీంతో విద్యార్థులు భోజనం చేసే వరకు ఉపాధ్యాయులు కాపలాగా ఉండాల్సిన పరిస్థితి. విద్యార్థులను గాయపరిచి ప్లేట్లు ఎత్తుకుపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజనశాలల నిర్మాణాలు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు.

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



మధ్యాహ్నం అన్నం తినే సమయంలో కోతులు మా పైకి ఉరికి వస్తుంటాయి. చేతులు, ప్లేట్లు కడుకునేందుకు వీలులేకుండా ఇబ్బంది పెడుతున్నాయి. మేం తినేదాకా ఉపాధ్యాయులు కాపలాగా ఉంటారు. వంట చేసే సమయంలోను కాపలా ఉండాల్సివస్తోంది. ప్రభుత్వం స్పందించి భోజనశాలను వెంటనే పూర్తిచేసి కోతుల నుంచి కాపాడాలి.

– నాగచైతన్య, 9వ తరగతి, గుడికందుల

నిధులు రాగానే పూర్తిచేయిస్తాం..

నిధుల కొరత మూలంగానే భోజనశాలల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. తొగుట పాఠశాలలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. మంజూరు కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

–నర్సయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ, తొగుట

మృతులకు రూ.కోటి పరిహారమివ్వాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

సిద్దిపేటఅర్బన్: పాశమైలారంలోని సిగాచి కెమికల్స్ కంపెనీలో జరిగిన ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, వారిపై చర్యలు తీసుకుని ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.కోటి పరిహారమివ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మంగళవారం డిమాండ్ చేశారు. యాజమాన్యం లాభాలను పెంచుకోవడంలో చూపిన శ్రద్ధ కార్మికులకు రక్షణ కల్పించడంలో చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలు, క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

యాజామాన్యం, అధికారుల నిర్లక్ష్యం

గజ్వేల్: యాజామాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే సిగాచీ పరిశ్రమలో ప్రమాదం చోటుచేసుకుందని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి ఆరోపించారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమ యాజమాన్యం కీలక ప్రదేశాల్లో స్కిల్డ్ లేబర్ కాకుండా, అన్‌స్కిల్డ్ లేబర్‌తో పనులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే రియాక్టర్ పేలి ఎంతో ప్రాణ నష్టం సంభవించిందని మండిపడ్డారు. పరిశ్రమల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సిన ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. యాజమాన్యాలు లాభాలకు కక్కుర్తి పడి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో కాలేజీకి రోడ్డు



సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

హుస్నాబాద్‌రూరల్: పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డును రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 'కాలేజీకి రోడ్డు నిర్మించరూ..?' అనే శీర్షికన సోమవారం సాక్షిలో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను పనుల వివరాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో డీఈ మహేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పనులు ప్రారంభించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు హిందీ బోధించేందుకు గెస్ట్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వన్నెస మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంటల ప్రాతిపదికన బోధించేందుకు ఆసక్తికల అభ్యర్థులను గురువారం పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.

ఉపాధ్యాయుల కృషి వల్లే..

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కృషివల్లే విద్యార్థుల సంఖ్య పెరిగిందని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు చేరడంపై హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులను మంగళవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శక్తివంచన లేకుండా కృషి చేస్తా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఉపాధ్యాయుల సమస్యలపై శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ములుగు మండలం తున్కిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఎం బి.రంగారావు ఉద్యోగ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అన్ని కార్పొరేట్ ఆస్పత్రులలో వర్తింప జేసే విధంగా ఉపాధ్యాయులకు త్వరలోనే హెల్త్ కార్డులు అందజేయనున్నామన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇప్పిస్తామని, అందులో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు లాభపడే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వంగ మహేందర్‌రెడ్డి, ఎంఈఓలు ఉదయ్‌బాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, పీఆర్‌టీయూ నేతలు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, రాధిక, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, వీణమ్మ, రామనర్సయ్య, శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

చదువులో రాణించినప్పడే గుర్తింపు

ములుగు(గజ్వేల్): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. లైబ్రరీకి కథల పుస్తకాలను కూడా అందజేశారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ, సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు లయన్స్ డిస్ట్రిక్ నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అమర్‌నాథ్‌రావును లయన్స్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దీప్తితో పాటు సిబ్బందిని సత్కరించారు. ఎంఈఓ ఉదయ్‌బాస్కర్‌రెడ్డి, పూర్వ డిస్ట్రిక్ గవర్నర్ సూర్యరాజు, హరీశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుల ప్రక్రియ వేగవంతం

సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ రుషికేష్ శ్రీవాత్సవ్



పరిశీలిస్తున్న రుషికేష్ శ్రీవాత్సవ్

దుబ్బాక: మున్సిపాలిటీలో వాణిజ్య, వ్యాపార సముదాయాలకు జారీచేసే ట్రేడ్ లైసెన్సుల ప్రక్రియను వేగవంతం చేయాలని సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ రుషికేష్ వాత్సవ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ, భువన్ యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించే వివరాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను కమిషనర్ రమేశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్సుల దరఖాస్తులపై అవగాహన కల్పించాలన్నారు. భువన్‌యాప్‌లో భవనాలు, వాణిజ్య, వ్యాపారాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

పనులు పరిశీలించిన అదనపు కలెక్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న గరీమా అగర్వాల్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పరిశీలించారు. స్థానిక 43వ వార్డులో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు లక్ష్మి స్థలాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ డీఈ ప్రేరణ, హౌసింగ్ అధికారి దివ్య, మున్సిపల్ అధికారి శ్రీనాథ్, వార్డు కౌన్సిలర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు రానివారు ఆందోళన చెందొద్దు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లిస్టులో పేరు రానివారు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలో ఇందిరమ్మ ఇళ్లకు మంగళవారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా డబుల్ బెడ్రూంలు రూం ఇస్తామని చెప్పి కాలయాపన చేశారన్నారు. నాయకుల సంక్షేమం తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కష్టపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, రియాజొద్దీన్, కలీమొద్దీన్, పయ్యావు ఎల్లం యాదవ్, మధు, నజ్జు, హర్షద్, మహబ్, రజిని, సంతోష, సాయి, ప్రతాప్, రాకేశ్, రాజు, షాబొద్దీన్, మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి భూమిపూజ నాయకులు

అర్హులందరికీ ఇళ్లు

దుబ్బాకటౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బురాణి శ్రీకాంత్ అన్నారు. ధర్మాజీపేట వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణకి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈ జాహ్నవి, వార్డు అధికారులు రమేశ్, మాజీ కౌన్సిలర్ స్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వానాకాలం జరభద్రం

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 5వ వార్డులో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో టైర్లు, పాత కుండల్లో ఉన్న నీటిని పారబోశారు. ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. 9వ వార్డులో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా ఇంటిలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, వార్డు అధికారులు, మెప్మా రిసోర్స్‌పర్సన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న కమిషనర్ మల్లికార్జున్

వైద్యులు ప్రజల ప్రాణాలు రక్షించే దేవుళ్లు

సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): వైద్యులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించే దేవుళ్లని సీఐ ఎల్.శ్రీను ప్రశంసించారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యశోద ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు తమ వ్యాపారం కోసమే కాకుండా ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నీరేష్, పీఎస్‌ఐ సమత, ఎంఈఓ కిష్టయ్య, వైద్యులు శ్రీకాంత్, పరమేశ్వర్, సంతోష్‌కుమార్, రఘునందన్, సతీశ్, బాలకిషన్, శ్రీకాంత్, నాయకులు ఆగంరెడ్డి, కళావతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులతో వైద్యులు

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాలకు రూ.10 లక్షల విరాళం**

చిన్నకోడూరు(సిద్దిపేట): వైద్యుల దినోత్సవం సందర్భంగా చిన్నకోడూరుకు చెందిన ప్రముఖ వైద్యులు రాంచందర్‌రావు, అతని సోదరుడు లక్ష్మణ్‌రావు పాఠశాలలో రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని ఆ దిశగా కష్టపడి ఉన్నతులుగా ఎదగాలన్నారు. హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **కంది సాగు విస్తరణకు చేయూత**

తొగుట(దుబ్బాక): కంది సాగు విస్తరణ కోసం ప్రభుత్వం చేయూత నిస్తుందని దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి అన్నారు. తొగుటలో కంది విత్తన మినీ కిట్లను డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు మల్లయ్యతో కలిసి మంగళవారం రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది సాగును అంతర పంటగా సాగుచేసి అధిక ఆదాయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ మోహన్, ఏఈఓ రాజేశ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

◆ **ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం**

నంగునూరు(సిద్దిపేట): ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఈఏపీసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొదటి రోజు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విద్యార్థులకు ఐడీ, పాస్‌వర్డ్ అందజేశామని, ఐడీ పొందిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అభినవ్ పాల్గొన్నారు.

◆ **అవగాహన అవసరం**

మిరుదొడ్డి(దుబ్బాక): అంతర పంటలతో మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలంటే కంది సాగుపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పప్పు దినుసులు 2025 పథకంలో భాగంగా రైతు వేదికలో రైతులకు కంది విత్తనాలను అందజేశారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

◆ **ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ**

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని కాన్గల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాసిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డిని మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. వారి తల్లి అనసూయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, నాయకులు కనకయ్య, కరుణాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **సైబర్ నేరాలపై అవగాహన అవసరం**

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్, పోలీస్‌శాఖకు చెందిన డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ **130 మందికి షూస్ అందజేత**

సిద్దిపేటఅర్బన్: మండలంలోని నాంచార్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యార్థులకు అండగా నిలిచారు. హెచ్‌ఎం సుజాత తన సొంత నిధులు రూ.25 వేలతో 130 మంది విద్యార్థులకు షూలు సమకూర్చారు. అర్బన్ ఎంఈఓ రాజప్రభాకర్‌రెడ్డి హాజరై మంగళవారం వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన హెచ్‌ఎం సుజాతను ప్రశంసించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, దేవరాజ్, అమిత, స్రవంతి, చంద్రమౌళి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **వ్యవసాయరంగానికి ప్రోత్సాహం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): వ్యవసాయరంగానికి హస్ సంస్థ ప్రోత్సాహం అందిస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఆంటోని అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేట రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మంగళవారం 50 మంది రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్ ఆధ్వర్యంలో కొనేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామంలో నాలుగేళ్లుగా విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ శాంతి, సభ్యులు కిష్టయ్య, స్వామి, విష్ణు, చారి, సంతోష్, నర్సింహులు, రమేశ్, కరుణాకర్‌రెడ్డి, బాలకృష్ణ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ **238 మందికి వైద్య పరీక్షలు**

హుస్నాబాద్: హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. ఈ శిబిరంలో 238 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.